## క్లుప్తంగా

### ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



దర్శి(కురిచేడు): ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు జీ రంగస్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి డీ శ్రీనివాసులు హాజరయ్యారు. అధ్యక్షుడిగా తూము శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నక్కా కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బీ వెంకటేశ్వర్లు, వై రాజశేఖరరెడ్డి, బీవీ నారాయణ, సీహెచ్ అనిత, కార్యదర్శులును ఎంపిక చేశారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న చీదెళ్ల బసవయ్య, వెంకటరమణమూర్తి, ఉద్యోగోన్నతి పొందిన వేమా రమణయ్యలను ఘనంగా సన్మానించారు.

### కాటమరాజుస్వామికి భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు.



బూచేపల్లి, తాటిపర్తిలకు పూలతో స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు



త్రిపురాంతకంలో నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి, తాటిపర్తి

# ప్రజా సమస్యలపై విస్తృత పర్యటన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి, ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. రైతులు ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. మండలంలోని త్రిపురాంతకం, గణపవరం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలపై స్పందించారు. గ్రామాలలోని సమస్యలను ప్రజలు వివరించారు. రైతులకు ఈఏడాది పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పూర్తిగా నష్టపోయామని రైతులు వివరించారు. సాగర్ కాలువలను మరమ్మతులు చేయాలని, పంటలకు ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రైతు సమస్యలు వివరించారు. త్రిపురాంతకంలోని పాటిబండ్ల వారి ఇంట్లో వేడుకల్లో పాల్గొన్నారు. గణపవరంలో ఇటీవల మృతి చెందిన నూనె నారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. వీరి వెంట ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ జాన్‌పాల్, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, రంగబాబు, గాలెయ్య, కోటి, బాల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మారెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి, తాటిపర్తి

**గాదె బ్రహ్మారెడ్డికి బూచేపల్లి, తాటిపర్తి పరామర్శ..**

పెద్దదోర్నాల: మండలంలోని చిన్నగుడిపాడులో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె బ్రహ్మారెడ్డిని తన నివాస గృహంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించిన వారిలో మండల కన్వీనర్ గంటా రమణారెడ్డితో పాటు మండల నాయకులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

**యడవల్లిలో పర్యటించిన బూచేపల్లి, తాటిపర్తి**

జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌లు మండలంలోని యడవల్లిలో ఆదివారం పర్యటించారు. గ్రామంలో మండల పార్టీ నాయకుడు చిట్యాల వెంకటేశ్వరరెడ్డి ఇంట జరిగిన శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నాయకులకు యడవల్లి వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తొలిసారి గ్రామంలో పర్యటించిన బూచేపల్లి, చంద్రశేఖర్‌లకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ప్రధాన రహదారి నుంచి శుభ కార్యక్రమం జరిగే ప్రాంతం వరకు దారి పొడవునా నాయకులపై పూలవర్షాన్ని కురిపించారు. అనంతరం ఇరువురిని స్థానిక నాయకులు పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్. అబ్దుల్ మజీద్, జిల్లా నాయకులు సింగా ప్రసాద్, వైఎస్సార్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ షెక్షావలి, చిట్యాల యోగిరెడ్డి, బొగ్గరపు రమేష్, యక్కంటి లింగారెడ్డి, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పొందుగుల నాగ మల్లేశ్వరి, స్థానిక నాయకులు వెన్నా పాండు రంగారెడ్డి, యక్కంటి శివారెడ్డి, అలుగుల రత్నంరాజు, మల్లెల మధు, తదితరులు పాల్గొన్నారు.

### ఎంఈఓకు వీడ్కోలు సన్మానం



ఎంఈఓ దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

ముండ్లమూరు(కురిచేడు): మండల విద్యాశాఖాధికారి జలపాటి సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం మోడల్ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. మండలంలోని బృందావనం హెచ్‌ఎం జీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు చిట్టేటి భాగ్యలక్ష్మి, అంబటి చిన వెంకటేశ్వరరెడ్డి, పులిపాడు ఎస్సీ పాఠశాల హెచ్‌ఎం ఎం ఈశ్వరమ్మలు ఎంఈఓ దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. శేషజీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడవాలని వారు ఆకాంక్షించారు.

### గడ్డి వామి దగ్ధం

దర్శి(కురిచేడు): ప్రమాదవశాత్తు గడ్డి వామి దగ్ధమై రూ. 30 వేల ఆస్తినష్టం జరిగిన సంఘటన దర్శి నగరపంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏరువ విజయమ్మకు చెందిన రెండు ఎకరాల్లోని వరిగడ్డి వామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయింది. అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించటంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ. 30 వేల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితురాలు విజయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

### 85 మందికి కంటి పరీక్షలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చింతల, కొర్రప్రోలులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పెదకాకానికి చెందిన శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో శంకర్ కంటి వైద్యశాలకు చెందిన సిబ్బంది పాల్గొని చెంచు గిరిజనులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 85 మందికి పరీక్షలు నిర్వహించగా, వారిలో 32 మందికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. శస్త్ర చికిత్సల నిమిత్తం వారిని పెదకాకానికి తీసుకువెళ్తామని శంకర్ కంటి వైద్యశాల సిబ్బంది తెలిపారు.



# వరుణ దేవా.. వాన కురిపించయ్యా!



చందవరంలో రచ్చబండపై మాట్లాడుకుంటున్న ప్రజలు



విత్తడానికి తయారు చేసిన పొలం

- ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- వాన కోసం రైతన్న ఎదురు చూపులు

దొనకొండ: వరుణుడు కరుణించడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. అప్పులు చేసి పొలాలు విత్తటానికి సిద్ధం చేశాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 10 రోజులు కావస్తోంది. వాన ఎప్పుడు పడుతుందో.. పొలంలో విత్తనాలు ఎప్పుడు నాటాలో అని రైతన్న వాన కోసం ఎదురు చూస్తున్నారు. కంది, ఆముదం, పత్తి విత్తనాలు విత్తడానికి దూర ప్రాంతమైన వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి ఇళ్లల్లో పెట్టుకున్నారు. పల్లెల్లో ఏ పనులు లేక చెట్ల కింద, రచ్చ బండ వద్ద, దేవాలయాల వద్ద రైతన్నలు ఉదయం, సాయంత్రం ముచ్చట్లాడుకుంటున్నారు. దొనకొండ ప్రాంతం వర్షాధార పంటలు ఎక్కువ భాగం సాగు చేస్తారు. మరి కొద్ది రోజులు ఇలానే ఉంటే ఖరీఫ్ సీజన్ కూడా దాటి పోతుంది. పంటలు పండకపోతే ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. నోరు లేని గేదెలకు పశుగ్రాసం, తాగునీరు కరువై పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు ధర పలుకుతుంది. ఈ ఏడాది గడ్డు పరిస్థితి ఏర్పడేలా ఉందని, ఏ పంటలు పండుతాయో ? ఎలా బతకాలో ? ఎలా అప్పులు తీర్చాలో ? శుభకార్యాలు ఎలా చేయాలో అంటూ రైతన్నలు డీలా పడ్డారు. ఏ గ్రామం చూసినా, ఏ రైతన్నను పలకరించినా కాలం సరిగా లేదంటూ దిగాలు పడుతున్నారు.

### కారును తప్పించబోయి దంపతులకు గాయాలు



గాయాలపాలైన నాగసురేష్

పెద్దదోర్నాల: వేగంగా వస్తున్న కారును తప్పించబోయి మోటారు సైకిల్ అదుపుతప్పడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలోని హసానాబాద్ సమీపంలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన నాగ సురేష్ దంపతులు మోటార్ సైకిల్‌పై శ్రీశైలం దైవదర్శనానికి బయలుదేరారు. బైకు మండలంలోని హసానాబాద్ సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారును తప్పించబోయారు. దీంతో బైక్‌పై ఉన్న దంపతులు కిందపడటంతో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన దంపతులను పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే జరిమానా

దొనకొండ: ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని.. లేకపోతే భారీగా జరిమానా విధిస్తామని త్రిపురాంతకం సీఐ హసన్ హెచ్చరించారు. ఆదివారం ఆటో డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొనకొండ రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా రైలు బండ్లు స్టేషన్‌కు వచ్చినప్పుడు సంచరిస్తున్నారేమోనని తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సీఐ సూచించారు. ఈ రోజుల్లో అనేక రకాలుగా దొంగతనాలు జరుగుతున్నాయని, కొంతమంది సాధుల వేషంలో, కొంతమంది మానసిక రోగులుగా, కొంతమంది మగవాళ్ల ఆడవాళుగా మారి దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో ఆయన రైల్వే పోలీసులతో మాట్లాడారు



# నిరుపేద కుటుంబంలో సరస్వతి పుత్రులు



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అక్కాతమ్ముడు

పెద్దదోర్నాల: వారో మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు. తమ పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పించాలనుకున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వేల రూపాయల ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత లేక పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఆ పిల్లలు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా, ఉన్నత శ్రేణిలో మెరుగైన ఫలితాలను సాధించారు. దీంతో పాటు వారిరువురు ట్రిపుల్ ఐటీకి ఎంపికై తల్లిదండ్రుల కష్టానికి తగ్గట్టుగా మెరుగైన ఫలితాలు సాధించి ప్రతి ఒక్కరితో శభాష్ అనిపించుకుంటున్నారు. మండల కేంద్రంలోని మెట్టబజార్‌లోని దర్గా వీధికి చెందిన మద్దికుంట రమణయ్య, కాశీశ్వరిలు దంపతులు. తండ్రి రమణయ్య ద్విచక్ర వాహనంపై మొబైల్ బట్టల వ్యాపారం నిర్వహిస్తుండగా, తల్లి కాశీశ్వరి టైలరింగ్ వృత్తిగా చేస్తూ తమ బిడ్డలను పోషించుకుంటున్నారు. తమ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చిన్ననాటి నుంచే తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 తరగతి వరకు పోటీపడి చదివే వారు. ఈ నేపథ్యంలో గత ఏడాది పదో తరగతిలో కుమార్తె మద్దికుంట స్పందన 600 మార్కులకు గాను 584 మార్కులు సాధించి మండలంలోనే టాపర్‌గా నిలిచింది. దీంతో పాటు నూజివీడులో ట్రిపుల్ ఐటీ సాధించి అందరి మన్ననలు పొందింది. అక్కను స్ఫూర్తిగా తీసుకున్న తమ్ముడు దిలీప్‌కుమార్ సైతం ఈ ఏడాది పది పరీక్షల్లో 573 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించి ఒంగోలులో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. పేదింటి పిల్లలైన వీరు చదువుల్లో చిచ్చర పిడుగుల్లా రాణిస్తూ ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించడంపై ఉపాధ్యాయులు, సహచరులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

### కార్మికుల సమ్మెకు సిద్ధం



సివిల్ సప్లై అధికారికి వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

దొనకొండ: కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తామని కార్మికులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. దొనకొండలో సివిల్ సప్లై కార్మికులు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో జూలై 9న సమ్మె ఉంటుందని కార్మికులు తెలిపారు. ఆదివారం దొనకొండ సివిల్ సప్లై గోడౌన్‌లో కార్మికులు మాట్లాడారు. కార్మికుల పోరాటానికి ప్రతి ఒక్కరం కంకణం కట్టు కోవాలన్నారు. కార్యక్రమంలో ముఠా యూనియన్ నాయకులు గుడిమెట్ల ఆదాము, పి.నాగేశ్వరరావు, డి.నరసింహారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దొనకొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు తెలిపారు. ఆదివారం దొనకొండ యూటీఎఫ్ భవనంలో సమ్మె ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు.





# వాగును తలపిస్తున్న రోడ్డు



రోడ్డు మీద నిల్వ ఉన్న వాన నీరు

తాళ్లూరు: మండలంలో శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు చేరి వాగును తలపిస్తోంది. మండల కేంద్రానికి వెళ్లే తూర్పుగంగవరం ప్రధాన రహదారి మార్గాన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డుకు గుంతలు పడడంతో వాన నీరు చేరి వాగును తలపిస్తోంది. వాహనాల రాకపోకలతో వర్షపు నీరు రోడ్డు వెంబడి ఉండే ఇళ్లల్లోకి నీరు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మీద నిలిచిన వర్షం నీరు ఇళ్లల్లోకి చేరకుండా ఇసుక బస్తాలు అడ్డుగా రోడ్డు వెంబడి పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని, మండల అధికారులు రోజు ఈ మార్గంలోనే ప్రయాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రక్కు మట్టి వేసి గుంతను పూడ్చలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుకుంటున్నారు.